మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## అత్తారింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

**అమీన్‌పూర్, మార్చి30 ప్రభాతవార్త:**
అత్తారింటి వేధింపులు భరించలేక వివాహిత చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే జిన్నారం మండలం జంగంపేట గ్రామానికి చెందిన ఫకీర్ కరీం చిన్న కుమార్తె నసీమా బేగం (29) అమీన్‌పూర్ ప్రాంతానికి చెందిన ఎండీ పాషాతో 2017లో వివాహం జరిగింది. వీరికి ఇమ్రాన్ (5), అమ్మద్ (3) ఇద్దరు కుమారులు. గత కొద్ది రోజులుగా అకారణంగా భర్త, అత్త, బావ, మరిది, తోటి కోడళ్లు నసీమ వేగంను మానసికంగా, శారీరకంగా హిసించారు. ఈ విషయం పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయినప్పటికీ ఎండి పాషా కుటుంబ సభ్యులు ప్రవర్తన మార్చుకోకుండా వేధించసాగారు. వేధింపులు భరించలేక 29వ తేదీ శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అమీన్‌పూర్ ఇన్స్‌పెక్టర్, సీఐ సదా నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# బీఆర్ఎస్ మునిగిపోయే టైటానిక్..

### -బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



**కొల్చారం, మార్చి30 ప్రభాతవార్త:**
బీఆర్ఎస్ మునిగిపోయే టైటానిక్ పడవ అని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఎంపీ అభ్యర్థులు కరువయ్యారని, బీఆర్ఎస్ పార్టీ బీఫామ్‌లను అమ్ముకుంటుందని బీజేపీ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శనివారం కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి హనుమమ్మ గార్డెన్స్‌లో పార్టీ మండల అధ్యక్షులు పాతూరి దయాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ బూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి వాల్దాస్ రాధ మల్లేష్‌గౌడ్, మురళీధర్ యాదవ్, రఘునందన్‌రావులు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం నుంచి పనిచేసి అన్యాయానికి గురైన నాయకులు ఇప్పటికైనా పార్టీని వదిలేసి తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవాలని హితవు పలికారు. ఎక్కడా లేని బీఆర్ఎస్ మెదక్‌లో ఉందని చెప్పుకుంటూ కొంతమంది కబ్జాకోరులు వస్తున్నారని, వారిని నమ్మకూడదన్నారు. జలదృశ్యం నుంచి జై తెలంగాణ అన్నవాడు ఒక్కరూ మెదక్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు దొరకలేదా అని ప్రశ్నించారు. ఉద్యమ పురిటిగడ్డ అయిన మెదక్ నుంచి పోటీ చేయడానికి ఒక్కరూ లేరంటేనే అర్థం చేసుకోవాలన్నారు. వంచన, మోసానికి ప్రతిరూపం హరీష్‌రావు అని, తన జోలికి రానంతవరకు ఎవరినీ పట్టించుకోనని, తన పేరు ఎత్తితే మాత్రం ఎంతకైనా తెగిస్తానన్నారు. సభ్యత, సంస్కారం లేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడితే, బెదిరిస్తే భయపడే అలవాటు లేదని, కబ్జాల పైసలు, రింగు రోడ్డు వంకరలు తిప్పిన పైసలు లేకపోవచ్చు కానీ జై తెలంగాణ అన్న గుండె ధైర్యం ఉందన్నారు. కేసీఆర్‌ను ఇంటికి పంపాలనే నిర్ణయంతో అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రజలు గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మోడీ ప్రభుత్వానే కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి 100 కోట్లతో ట్రస్టు ఎలా పెడతారో చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ అఫిడవిట్‌లో 17 కోట్లు చూపించిన అతను 100 కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తనను మెదక్ పార్లమెంట్ నుంచి ఎంపీగా ప్రజలు ఆశీర్వదిస్తే చరిత్రలో చెప్పుకునే విధంగా మెదక్ పార్లమెంట్ నియోజవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పాతూరి దయాకర్‌గౌడ్, ఎంపీటీసీ సామల మమత యాదగిరి, బీజేపీ నేతలు రమేష్, రాకేష్, నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్, రాజేందర్, నర్సాపూర్ మాజీ సర్పంచి వెంకటరమణ, వాల్దాస్ మల్లేష్గౌడ్, రమేష్, హరీష్, రాజేందర్‌గౌడ్, సార భూమేష్, తమ్మలి సంతోష్, వెంకటేశం, మండలంలోని బీజేపీ బూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, శక్తి కేంద్రం ఇంచార్జులు, బీజేపీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తునికి జాతరలో వైభవంగా బండ్ల ఊరేగింపు

-భక్త జన సంద్రమైన తునికి శ్రీ నల్ల పోచమ్మ జాతర
-జాతరలో డప్పుచప్పుల దరువులు... పోతరాజుల గావుకేకలు
శివసత్తుల పూనకాలు....శ్రీ నల్ల పోచమ్మ నామ స్మరణలు
-బోనాలతో తునికి నేల తడిసిముద్దైయింది
-బండ్ల ఊరేగింపులో దుమ్ము రేపిన కోడెలు

**కౌడిపల్లి, మార్చి30, ప్రభాతవార్త:**
జిల్లాలోనే రెండవ అతి పెద్ద జాతరగా పేరు గాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం నాడు భక్తుల జన సంద్రం నడుమ అంగరంగ వైభవంగా బండ్ల ఊరేగింపు ప్రదర్శన కార్యక్రమం కొనసాగింది. జాతర ఉత్సవాలతో పాటు ఎంతో విశిష్టత కల్గిన బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని తిలకించడానికి మండల పరిసరా ప్రాంతాల గ్రామాలతో పాటు నియోజక వర్గంలోని ప్రజలతో పాటు, హైదరాబాద్ జంట నగరాల నుండి పెద్ద ఎత్తున భక్తులు జాతర ఉత్సవాలను తిలకించి, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. తునికి జాతరలో ఎక్కడ చూసిన గుడారాలు కనిపించడం జరిగింది. వారి గుడారాల నుండి అమ్మవారికి బోనాలను సమర్పించడానికి డప్పుచప్పుల దరువుల నడుమ, శివసత్తుల పూనకాలతో నల్ల పోచమ్మ అమ్మవారి నామ స్మరణతో ఊరేగింపుగా వచ్చి బోనాలను ఆలయ చుట్టు ప్రదక్షణలు చేసి బోనం నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారికి భక్తులు ఓడి బియ్యాలు, కుంకుమార్చనలు చేసి, జంతు బలి ఇచ్చి తమ కొరిన కోరికలు తీర్చినందులకు మొక్కలు తీర్చకున్నారు. కాగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన హిజ్రాల బృందం శ్రీ నల్ల పోచమ్మ తల్లికి బోనాలను ప్రత్యేక ఆకర్షణతో డప్పు మేళాల నడుమ ఊరేగింపుగా వచ్చి సమర్పించడాని జాతర ఉత్సవాలను తిలకించడానికి విచ్చేసిన భక్తులు తిలకించి ఆనందోత్సవాలను గడిపినారు. తునికి జాతరను సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడానికి ముదిరాజ్‌ల ముద్దు బిడ్డ, మెదక్ ఎంపి అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, టిపిసిసి మెదక్ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడు, టిపిసిసి అధికార ప్రతినిథి ఆవుల రాజురెడ్డి, ప్రధాన కార్యదర్శి పాషా, చంద్రం క్రిష్ణాగౌడు తదితరలు విచ్చేసిన అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈఓ, చైర్మెన్‌లు వారికి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి కృషి చేస్తానని నీలం మధు ముదిరాజ్ ఈఓ మోహన్‌రెడ్డికి హామి ఇచ్చారు.

### జాతరలో ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగుకుండా తగు చర్యలు

బండ్ల ఊరేగింపు కార్యక్రమంలో ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నర్సాపూర్ సిఐ జానరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తీతో తగు చర్యలు తీసుకున్నారు. ఈ యేడు దాదాపు 30 బండ్లు బండ్ల ప్రదర్శనలో పాల్గొనగా, గుమ్మటాల బండి ప్రత్యేక ఆకర్షణగా నిల్చింది. ఆలయం వద్ద ఏలాంటి త్రాగునీటి సమస్య రాకుండా ఈఓ తన సిబ్బదితో చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరి తోపాటు, ఎంపిటీసి సాజిదా బేగం పాషా, ఆలయ కమిటీ మాజీ చైర్మెన్లు చల్లా మల్లేశం, తాళ్ల గోపాల్ రెడ్డి, బండ సాయాగౌడు, ఆలయ ఉత్సవ పాలక వర్గ సభ్యులు తాళ్ల శ్రీకాంత్ రెడ్డి, వడ్ల ప్రభాకర్ చారీ, తాళ్ల నారాయణ రెడ్డి, అంబూరి సునీత, రమావత్ మహేందర్, తలారి భిక్షపతి, చల్ల పర్వతాలు యాదవ్, కలాలి లక్ష్మినారాయణ గౌడు, హన్మొల్ల రాములు, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, శేఖర్, ఆలయ సిబ్బంది వెంకట్ రెడ్డి, ఏడుపాయల వనదుర్గ సినియర్ ఆసిస్టెంట్ సూర్య శ్రీనివాస్ గౌడు, మల్లికార్జున్‌రెడ్డి, శ్యామ్, రమేష్ గౌడు, ఆలయ పూజార్లు, పోలీసులు, గ్రామ పెద్దలు శేఖర్, వాలంటీర్లు, భక్తులు తదితరలు ఉన్నారు.

## భవనం పన్ను కట్టలేదని శ్రీచైతన్య పాఠశాలకు సెలవు...


శ్రీచైతన్య స్కూల్ ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

-విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని విద్యార్ధి సంఘాల మండిపాటు
-చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

**చేర్యాల,మార్చి 30,ప్రభాతవార్త**
చేర్యాల పట్టణంలో ఉన్న శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు, పలు విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. పాఠశాల భవనం పన్ను చెల్లించకపోవడంతో శుక్రవారం మున్సిపల్ అధికారులు స్కూల్‌కు తాళం వేసిన విషయం విధితమే. దీంతో శనివారం స్కూల్ యాజమాన్యం ఈ విధంగా మెసేజ్ పెట్టారు. తేది. 30-03-2024న పాఠశాలకు సెలవు ప్రకటించడం జరిగినది దీనికి కారణం బిల్డింగ్ ఓనర్ మున్సిపాటి వారికి చెల్లించాల్సిన పన్నును సకాలంలో చెల్లించలేదని స్కూల్ బిల్డింగ్‌ను సీజ్ చేయడం జరిగిందని అందుచేతనే పాఠశాలకు సెలకు ప్రకటించడం జరిగినది. దీనికి శ్రీ చైతన్య స్కూల్‌కి ఎలాంటి సంబంధం లేదు. దీనిని మీరు గమనించగలరు. బయటవారు చేసే అసత్యపు ప్రచారమును నమ్మొద్దని, ఈవిషయాన్ని మీరు అర్థం చేసుకుంటారని అనుకుంటున్నామని ఇలా తేలికగా స్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు మేసేజ్ పెట్టారు. ఒక విద్యాసంస్థనే కాకుండా ఏ ఇతర సంస్థలు నడేపే ముందు అందుకు కావల్సిన అనుమతులు, ఒప్పందాలు, వసతులు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నాకే ఆ సంస్థను నడపాల్సి ఉంటుంది. కాని ఇవేమి పట్టనట్లు విద్యను వ్యాపారం చేసుకుని కొంతమంది అడ్డదారులు తొక్కి ఇష్టారాజ్యంగా సంస్థలు నడుపుతూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారు. నడిపే సంస్థలు సరైనా అనుమతులు పొందాయా లేదా విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు ఉన్నాయా లేదానని సంబంధిత విద్యాశాఖ అధికారులు ఏనాడు పాఠశాలలను సందర్శించి, తనీఖీలు చేసిన దాఖలాలు లేవు. కొంత మంది రాజకీయ నాయకుల, అధికారులను వారి చెప్పుచేతుల్లో పెట్టుకుని ఇలాంటి సంస్థలు ఒక వ్యాపారంగా చేసుకుని సొమ్ముచేసుకుంటున్నారే తప్పా విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులున్నాయానని పట్టించుకున్న సందర్భాలే లేవు.

**అసలు శ్రీచైతన్య పేరుతో అనుమతులు పొందారా...?**
శ్రీచైతన్య పేరు చెబుతూ మరోపేరుమీద పాఠశాలను నడిస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అసలు ఈ పాఠశాలకు అనుమతులు ఉన్నాయా.?ఉంటే ఏ పేరుతో నడిపిస్తున్నారో ఇప్పటికి ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది. అన్ని అనుమతులతో నడుస్తున్నట్లయితే పాఠశాల పేరుతో బోర్డు ఇప్పటికి ఎక్కడకూడా కానరాకుండా ఇంత గోప్యంగా ఉంచడం వెనుక అసలు కారణం ఎంటోనని పలువురు అనుమానిస్తున్నారు.

**స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని నిరసన...**
స్కూల్ యాజమాన్యం, భవన యజమాని మధ్య సమన్వయం లేక విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే సహించేది లేదని శనివారం శ్రీచైతన్య స్కూల్ ముందు ఏఐఎస్‌బి విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. భవన యజమాని పన్ను కట్టలేదని స్కూల్ యాజమాన్యం సెలవు ప్రకటించడం సరైంది కాదని వెంటనే సంబంధిత అధికారులు ఈ స్కూల్‌పై చర్యలు చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

**ఎట్టకేలకు పన్ను చెల్లింపు...**
శ్రీచైతన్య పాఠశాల పేరుతో నడుస్తున్న భవన ఆస్తి పన్నును భవన యజమాని ఎట్టకేలకు శనివారం మున్సిపల్ అధికారులకు పన్ను చెల్లించారు. మొత్తం మూడున్నర ఏండ్ల బకాయిలో రెండున్నర ఏండ్ల బకాయి రూ. 3లక్షల 18వేలు904చెల్లించారు. ప్రస్తుత ఏడాదిన్నర పన్ను చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## బాల్యవివాహాలు వద్దు-ఆరోగ్య సమస్యలు తెచ్చుకోవద్దు

### -సఖీ అవగాహన సదస్సులో రేణుక


గడిపెద్దాపూర్‌లో సఖి అవగాహన సదస్సు నిర్వహిస్తున్న మెదక్ సఖీ కేంద్రం నిర్వాహకులు

**అల్లాదుర్గం, మార్చి 30, ప్రభాతవార్త:**
బాల్య వివాహాలు చట్ట విరుద్ధముతో పాటు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని మెదక్ సఖీ కేంద్రం నిర్వాహకురాలు రేణుక అన్నారు. మండలంలోని గడిపెద్దాపూర్‌లో శనివారం మెదక్ సఖీ కేంద్రం, మై చాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సఖీ అవగాహన సురక్షత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహకులు రేణుక మాట్లాడుతూ బాల్య వివాహాలతో పుట్టబోయే బిడ్డలకు అంగవైకల్యం లాంటి అనారోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, గృహహింస, వరకట్న వేధింపులు, బాల కార్మికులు, మానవ అక్రమ రవాణా, ఈ యాసిడ్ దాడులు, హత్యాచారాలు, ప్రేమ ప్రలోభాలతో మిస్సింగ్ కేసులు, కిడ్నాప్ కేసులు, ఫోక్సో కేసులు ఎక్కువ శాతం నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మాయిలను, మహిళలను అక్రమంగా రవాణ చేసి వ్యభిచార గృహాలకు, అబ్బాయిలను కర్మాగాలకు తరలిస్తూ బాలకార్మికులుగా మారుస్తున్నారని గుర్తు చేశారు. పరులు చెప్పే మాయమటాలకు మోసపోకుండా ఉండాలని సూచించారు. తమ చిన్నారుల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు అప్రమత్తండా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తమ పిల్లలలో తరుచూ మాట్లాడుతూ ఉండాలన్నారు. మహిళలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు సఖి కేంద్రం 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. సఖి కేంద్రానికి గాయలతో వచ్చిన బాధిత మహిళలకు మెడికల్ సపోర్టు, సైకో సోషల్ కౌన్సిలింగ్, లీగల్ కౌన్సిలింగ్ ఇస్తారన్నారు. కుటుంబ సభ్యుల సహకారం లేని మహిళలకు సఖీ కేంద్రం తాత్కాలిక వసి ఏర్పాటు చస్తుందని సఖికేంద్రం కేస్ వర్కర్ ఎం కళావతి పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలికలకు చట్టాలపై ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 181, 112, 1098, 1800 4198588, 1930ల టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పెంటయ్య, గడి పెద్దాపూర్ పంచాయితీ కార్యదర్శి రాములు, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

### -జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్


మాట్లాడుతున్న జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్


**పెద్దశంకరంపేట, మార్చి30 ప్రభాతవార్త:**
ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో మూడోసారి కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శశనివారం మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని చీలపల్లి, మూసాపేట్, జమ్మికుంట గ్రామాలకు చెందిన పెద్దఎత్తున యువత, గ్రామస్థులు జహీరాబాద్ బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బీబీ పాటిల్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరందరికీ బీజేపీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 400 లకు పైగా పార్లమెంట్ స్థానాలను గెలుచుకొని మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరిస్తూ మరోసారి బీజేపీని గెలిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటీవ్ నెంబర్ మారుతిరెడ్డి, అధికార ప్రతినిధి సంగప్ప, పత్రి రామకృష్ణ, నాయకులు సూర్యప్రకాష్, పుట్టి అశోక్, సుభాష్ నాయక్, భాను, గంగారాం, రమేష్, శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, బీజేవైఎం అధ్యక్షులు కృష్ణ, ఓబీసీ అధ్యక్షులు అనిల్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు సుభాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 15 రోజుల మల్లన్న ఆదాయం రూ.61,89,123


మల్లన్న అలయ హుండీ లెక్కిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, మార్చి 30, ప్రభాతవార్త :**
మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం 15 రోజుల హుండీని శనివారం లెక్కించారు. 15 రోజులకు గానూ రూ. 61,89,123 నగదు, విదేశీ కరెన్సీ 23 నోట్లు, మిశ్రమ బంగారం 75 గ్రాములు, వెండి 6 కిలలో 400 గ్రాములు, 1200 కిలలో బియ్యం వచ్చినట్లు అలయ అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి ఏసీ శివరాజ్, అలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఈవో బాలాజీ, అలయ ధర్మకర్తలు బచ్చల శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, పాల్తే శ్రీనివాస్, కాగిత మోహన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది లడ్డు బాబు, రాధిక, మానస, అలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, అలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

### నర్సాపూర్‌లో ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు


నర్సాపూర్ పట్టణంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రం నుండి పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

**నర్సాపూర్ ,మార్చి 30 .ప్రభాతవార్త:**
నర్సాపూర్‌లో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈమేరకు నర్సాపూర్ పట్టణంలో 6 పరీక్షా కేంద్రాల్లో ఈ పదవరతగతి పరీక్షలు నిర్వహించగా విధ్యార్థులు చక్కని వాతావరణంలో ప్రశాంతంగా పది పరీక్షలను రాశారు. అంతేగాక ఈ పరీక్షా కేంద్రాల్లో వద్ద ఎటువంటి అల్లర్లు అలజడులు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఈ పరీక్షా కేంద్రాల్లో విధ్యార్థులకు అన్నివ సతులు కల్పించడం జరిగింది, ఈమేరకు పదవ తరగతి పరీఓలు రాసిన విధ్యార్థులు ప్రనాంతగతా పరీఓలను రాయడం జరిగింది. ఈ రోజుతో పదవతరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంతో పరీక్ష హాలు నుండి బయటకు పరుగులు తీశారు. ఈ మేరకు నర్సాపూర్ పట్టణంలో పదవ తరగతి పరీక్షలు శ్రాంతంగా , సజావుగా సాగాయి.

### ఎండిపోయిన వరి పంటను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి


పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాదికారి మేకల గోవిందు తదితరులు

**నర్సాపూర్ ,మార్చి 30 .ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండల పరిధిలోని పెద్దచింతకుంట గ్రామానికి చెందిన అయ్యవారి ధనుంజయ్ తన కున్న 6 ఎకరాల పొలంలో వరి పంటను వేశారు. ఈ వరి పంట నీటి వసతి లేకపోవడంతో పూర్తి గాఎండిపోయి రైతుకు తీవ్రంగా నష్టం కలిగింది. ఈమేరకు శనివారం జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవిందు ఎండిపోయిన ధనుంజయ్ వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దచింతకుంట గ్రామ రైతు అయ్యవార్ని దనుంజయ్ వేసిన వరి పంటను పరిశీలించానన్నారు ఈ రైతు నష్టపోయిన పంట శాతాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువేళ్తానని అన్నారు ఈమేరకు రైతు అధైర్యపడవద్దని ఆయన సూచించారు. ఈ ఎండిపోయిన వరి పంటకు నష్టపరిహారం చెల్లించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి. అనిల్‌కుమార్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ లావణ్య, వ్యవసాయ విస్తీర్ణఅధికారి శిరీషా, బాధిత రైతు అయ్యవారి ధనుంజయ్, మాజీ సర్పంచ్ గుండె శివకుమార్, అయ్యవారి మురళీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### సిలెండర్ పేలి ఇద్దరి మృతి...

**జహీరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** గ్యాస్ సిలెండర్ పేలిన సంఘటన ఇటీవల ఇద్దరు మృతి చెందిన కుటుంబాలకు ఎరుకుల సంఘం నాయకులు శనివారం ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర వస్తువులను అందచేశారు. పట్టణంలోని మాణిక్ ప్రభు వీధికి చెందిన ఎరుకుల లక్ష్మయ్య గుడ్లను ఉడకబెడుతుండగా ప్రమాదావశాస్తు గ్యాస్ సిలెండర్ పేలడంతో లక్ష్మయ్యతో పాటు కోడలు, మనవరాలు గాయాలకు గురై ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ లక్ష్మయ్య, చిన్నారి కీర్తిలు మృతిచెందారు. కోడలు సుగుణ కోలుకుంటోంది. ఇద్దరి మృతితో కుటుంబ శోక సముద్రంలో మునిగిపోవడంతో శనివారం ఎరుకుల సంఘం నాయకులు కుటుంబీకులను ఓదార్చి 35వేల రూపాయల ఆర్థిక సహాయం, నిత్యావసర వస్తువులను అందించారు. తెలంగాణ ఎరుకుల సంఘం జహీరాబాద్ తాలుకా అధ్యక్షులు మదుగొండ మహేష్, శివరాజ్, నిమ్మల కిష్టయ్య, బిఆర్ఎస్ నాయకులు బరూర్ దత్తాత్రి ముదిరాజ్, అశోక్, నారాయణ, పెంటన్న, తుకారం, రాజు, శ్రీనివాస్, సంతోష్ తదితరులు ఆర్థిక సహాయం అందించిన వారిలో ఉన్నారు.

## కాళ్ళు మొక్కినా తిరిగి వారిని పార్టీలోకి తీసుకోం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

-కేశవరావుకు ఏమి అన్యాయం చేశాం
-మూడుసార్లు రాజ్యసభ, కుమార్తెకు మేయర్, కొడుకుకు చైర్మన్ పదవులు ఇచ్చాం
-మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

**గజ్వేల్/గజ్వేల్ టౌన్, మార్చి 30 (ప్రభాతవార్త):**
కేశవరావుకు బిఆర్ఎస్ పార్టీలో ఏమి అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళాడని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. శనివారం గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శామీర్‌పేటలోని అరణ్య అతిథిగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు పాల్గొని మాట్లాడుతూ కేశవరావుకు మూడుసార్లు రాజ్యసభకు, కుమార్తెకు హైద్రాబాద్‌కు మేయర్‌గా, కొడుకుకు చైర్మన్ పదవులు ఇచ్చామని, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆయనకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, ఆ విషయం తెలియదా అని విమర్శించారు. కష్టకాలంలో పార్టీని విడిచిపెట్టిన వారిని కాళ్ళు మొక్కినా తిరిగి పార్టీలోకి తీసుకోమని పార్టీలో నిర్ణయం తీసుకున్నామని, ఈ విషయంపై ఎట్టి పరిస్థితిలోనూ ఊరుకోమన్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడికి పోయే నాయకులతో ఒరిగేదేమీలేదని, బిఆర్ఎస్ పార్టీలో ఎంత మంది పోయినా పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని, బిఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులు ఎంతగానో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా హామీలను నీటి బుడగల్లా చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉద్దెర పథకాలు మొదలుపెట్టారని, దీంతో ఆర్టీసీ, సివిల్ సప్లయ్ దివాలా తీయడం ఖాయమన్నారు. పెన్షన్ రూ. 4వేలు, రైతుబంధు రూ. 15వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు ఇంత వరకు రాలేదన్నారు.

**రఘునందన్‌రావు గురించి గ్రామాల్లో చర్చ పెట్టాలి**
గజ్వేల్ అభివృద్ధిని చూసి ఓర్వలేని రఘునందన్‌రావుకు ఎందుకు ఓట్లు వేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాల బాధితులను సిద్దిపేట తరహాలో పరిహారం ఇప్పిస్తానని మోసం చేశారు. నడిచే ఎద్దు అయితే అక్కడే నడుచు కదా దుబ్బాకలో మోసం చేస్తే బండకేసి కొట్టాలని, అందుకే రఘునందన్‌రావును ప్రజలు అసహ్యంచుకుంటున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదన్నారు.

**వెంకట్రాంరెడ్డి మంచి మనసున్న వ్యక్తి**
మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డి కలెక్టర్ హోదాలో ఉండి సిద్దిపేట జిల్లాలో తనదైన ముద్ర వేసుకున్నాడన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందంజలో ఉన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో వెంకట్రాంరెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గానికి 100 కోట్ల ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇది మీ అందరికి ఉపయోగపడుతుందన్నారు. కష్టకాలంలో విభేదాలు మరిచి జిద్దు కొద్దీ పనిచేసి వెంకట్రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి. రాజమౌళి, వైస్ చైర్మన్ జకియొద్దీన్, జెడ్‌పిటిసిలు పంగ మల్లేశం, సుధాకర్‌రెడ్డి, బాలు యాదవ్, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొట్టాల యాదగిరి, కల్యాణ్‌కార్ నర్సింగరావు, ఎల్ల వెంకటేష్, ప్రవీణ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొండపాక వైస్ ఎంపిపిపై వీగిన అవిశ్వాసం

### -గజ్వేల్ ఆర్డీఓ బన్సిలాల్



కొండపాక ఐఒసిలో విలేకరులతో మాట్లాడుతున్న గజ్వేల్ అర్డీఒ బన్సిలాల్

**కొండపాక, మార్చి 30, ప్రభాతవార్త**

కోరం లేకపోవడంతో కొండపాక వైస్ ఎంపిపి దేవి రవీందర్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాణం సరైన కోరం లేకపోవడంతో విగిపోయిందని గజ్వేల్ అర్డీఒ బన్సిలాల్ తెలిపారు. శనివారం కొండపాక ఐఒసి కార్యాలయంలో దేవి రవీందర్ పై పెట్టిన అవిశ్వాస బల పరీక్ష నిరూపణకు అర్డీఒ సమయం కేటాయించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవిశ్వాస తీర్మాణం నెగ్గడానికి 9 మంది ఎంపిటీసి సభ్యులు అవసరం ఉండగా 8 ఎంపిటీసి సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరు కావడంతో వైస్ ఎంపిపి దేవి రవీందర్ పై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మాణం విగిపోయిందని అర్డీఒ ప్రకటించారు. కాగా వైస్ ఎంపిపి దేవి రవీందర్‌పై ఈ నెల 5వ తేదిన 9 మంది ఎంపిటీసి సభ్యులు అవిశ్వాస తీర్మాణం ప్రకటిస్తు తీర్మాణ పత్రాన్ని గజ్వేల్‌లో అర్డీఒకు అందించారు. అనంతరం అర్డీఒ ఈ నెల 30న వైస్ ఎంపిపి బల పరీక్షకు తేదిని నిర్ణయించి బల పరీక్ష కోసం సమావేశం నిర్వహించారు. అర్డీఒ వెంట ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ దిలీఫ్ నాయక్ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబనికి ఆర్థిక సహాయం

**కొండపాక, మార్చి 30, ప్రభాతవార్త**

కుకునూరుపల్లి మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామానికి చెందిన దున్నపోతుల మల్లయ్య శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ మిట్టపల్లి రుషి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఒదర్చారు. అంత్యక్రియల కోసం రూ॥ 8 వేలను అర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఉపేందర్ గౌడ్, నాయిని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టపడి చదివితేనే పోటీ పరీక్షల్లో రాణిస్తారు

### -జిల్లా లీగల్ సర్వీసెస్ ఛైర్మన్ రఘురాం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కోర్టు న్యాయమూర్తి రఘురాం

**కొండపా, మార్చి 30, ప్రభాతవార్త**

విద్యార్థులు బట్టి చదువుకు స్వస్తి చెప్పి పాఠ్యాంశాలను అవగహన చేసుకున్నపుడే పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారని సూచించారు. శనివారం దుద్దెడ ఒ ప్రైవేట్ పాఠశాలలో జిల్లా న్యాయ సేవధికార సంస్థ అధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సెసన్స్ జడ్జీ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ టి. రఘురాం మాట్లాడుతూ పిల్లలు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. పిల్లలు మొబైల్ ఫోన్‌లు వాడడం వల్ల మెదడు పై ప్రభావం పడి మానసిక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. మొబైల్ ఫోన్‌లు వాడుతూ చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. రాజ్యంగంలోని ప్రాథమిక హక్కులు, ఫోక్సో చట్టాల గురించి విద్యార్థులకు అవగహన కల్పించారు. విద్యార్థులు తెలిసి తెలియక పెస్ బుక్, ఇన్‌ట్రా గ్రామ్‌లల్లో అనవసరమైన పోస్టింగ్‌లు పెట్టి ఇబ్బందులకు గురి అవుతున్నాట్లు వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా విద్యార్థులు వాహనాలు నడపడం చటరీత్య నేరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జీ స్వాతిరెడ్డి, సిద్దిపేట ఎసిపి మధు, సిద్దిపేట త్రి టౌన్ సిఐ విద్యాసాగర్, పాఠశాల ప్రిన్సిపాల్ రమెష్, లక్ష్మి, సుజాత, న్యాయ సేవ సిబ్బంది ఎ. శ్రీనివాస్ తదితులు పాల్గొన్నారు.

## చాకరిమెట్ల దేవస్థానానికి 3 లక్షల 27 వేల రూపాయల ఆదాయం



చాకరిమెట్ల దేవస్థానంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

**శివ్వంపేట, మార్చి30 ప్రభాతవార్త:**

ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శివ్వంపేట మండల పరిధిలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం 3 నెలల 11 రోజులకు గాను హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ హుండీ లెక్కింపులో భాగంగా దేవస్థానానికి 3 లక్షల 27 వేల 358 రూపాయల ఆదాయం సమకూరిందని దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, కార్య నిర్వహణ అధికారి సార శ్రీనివాస్‌లు ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమానికి దేవదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు రంగారావు కూడా రావడం జరిగింది. దేవస్థానం పాలకమండలి గ్రామస్థులు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యనరకమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు దేవత్తు శర్మ, సిబ్బంది రామకృష్ణ, శ్రీనివాస్, స్థానికులు నారాయణరావు, హరిసింగ్ నాయక్, శంకర్‌గౌడ్, చెన్నాపూర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

## హస్తాల్‌పూర్‌లో పౌరహక్కుల దినోత్సవం



పౌర హక్కుల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, మార్చి30 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ జయభారత్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ, ఎస్టీలను గుళ్లలోకి అనుమతించాలని, ఏదైనా అభ్యంతరాలు ఉంటే తమకు తెలుపాలన్నారు. గ్రామంలో జరిగే శుభకార్యాలలో ఎస్సీ, ఎస్టీలను అనుమతించాలన్నారు. రెండు గ్లాసుల పద్ధతిని విడనాడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ హసళ్ల వసతి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఏదైనా అంటరానితనం గురించి సంఘటన జరిగితే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. అందరూ కుల మతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు నర్సింహారెడ్డి, వినోద్, రాములు, బాబు, రాజు, హిందూబాయి తదితరులు పాల్గొన్నారు.

# బొంతపల్లి వీరభద్ర స్వామి పుణ్యక్షేత్ర దర్శనం అదృష్టం

**గుమ్మడిదల, మార్చి30 ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం గ్రామంలో కొలువుదీరిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం స్వామి వారికి అభిషేకం, మహా గణపతి రుద్ర హోమం, అఖండ దీపారాధన, దేవతా ఆహ్వాన ధ్వజారోహణ, పుట్టమన్ను తెచ్చుట, పెద్దన్న పూజ తదితర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి శశిధర్‌గుప్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత కన్నుల పండుగగా నిర్వహిస్తామని, అదే విధంగా ఈ సంవత్సరం కూడా జాతరకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న తహశీల్దార్ గంగాభవాని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ప్రసిద్ధి గాంచిన శైవ క్షేత్రాలలో వీరభద్ర స్వామి ఆలయం ఒకటని, ఈ ఆలయంలో భద్రకాళి శక్తిపీఠానికి ఓ ప్రత్యేకత ఉందని, అందుచేత రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తులు ఇంటి దేవునిగా కొలిచి మొక్కులు చెల్లించుకుంటారన్నారు. కుంకుమార్చనలు, ప్రస్తాయం పూజలు, నందీశ్వర, అశ్వ వాహన, హంస వాహన, బృంగేశ్వర పొన్న వాహన, గజవాహన సేవలు నిర్వహిస్తారన్నారు.. రుద్రహోమం, చండీ హోమం, అగ్ని గుండములు తొక్కుతారని, అత్యంత కన్నుల పండుగగా కళ్యాణం జరుపుతారని కళాకరుల ఆటపాటలతో డప్పు చప్పుళ్లు, వాయిద్యాలు, కోలాటాలు, భజన కీర్తనల మధ్య శ్రీ వీరభద్ర స్వామి రథోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్ది ప్రవీణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు సురభీ నాగేందర్‌గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధి విజయభాస్కర్‌రెడ్డి, దోమడుగు ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, పొన్నబోయిన వేణు, లక్ష్మీనారాయణ, మద్ధి ప్రతాప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆకుల ఆంజనేయులు, పడమని మహిపాల్‌రెడ్డి, గ్రామ ప్రముఖులు ఆలేటి జగన్‌మోహన్‌రెడ్డి, నరసింహారావు, గటాటి రవి, పన్యాల రాహుల్, ఆలయ సిబ్బంది సోమయ్య, అర్చకులు శివనాగులు, వీరేశం, నరేష్, శంకర్, అనిల్, కిరణ్ కుమారశర్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# మోడీ నాయకత్వంలో మెదక్ నుండి తప్పకుండా విజయం సాధిస్తా

### -మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



మాట్లాడుతున్న మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

**శివ్వంపేట, మార్చి30 ప్రభాతవార్త:**

నేడు దేశంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో కూడా మోడీ నాయకత్వంలో బీజేపీ పార్టీ బలమైన శక్తిగా మారుతుందని, మోడీ అమలు పరుస్తున్న పథకాలతోనే ప్రజల ఆశీర్వాదం వల్ల మెదక్ పార్లమంట్ స్థానం నుండి తప్పకుండా విజయం సాధిస్తామని బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని చంది కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల బీజేపీ అధ్యక్షులు పెద్దపులి రవి అధ్యక్షతన శనివారం మండల పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు మురళీ యాదవ్, వాల్దాస్ మల్లేష్‌గౌడ్, బుచ్చేష్‌యాదవ్, సంగసాని సురేష్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూడా అధిక స్థానాల్లో బీజేపీ అభ్యర్థులనే ప్రజానికం బలపరుస్తుందని ఆయన అన్నారు. దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల్లో కేవలం బీజేపీ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి అప్పులు తెస్తూ పాలన సాగిస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. మరోసారి కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలో ఉంటుందని, గెలిచే వారికే బలాన్ని ఇస్తూ తోడుగా నిలవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శివ్వంపేటకు చెందిన కొండల్‌రావు ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ సంగసారి సురేష్, నాయకులు రమణారావు, అశోక్ సాదుల, అంగడిపేట శ్రీనివాస్‌గౌడ్, నారాయణగారి వినోద్‌కుమార్, బల్కంపేట భాస్కర్, మంగలి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ పట్టణంలో

టిఆర్ఎస్ పార్టీలో మెదక్ ఎంపి అభ్యర్థికి ఉధ్యమ కారులు అర్హులు కాదాఅని మెదక్ బిజెపిఅభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలో బిజెపి మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి మెదక్ బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా ఏర్పాటు కోసం ఎంతో మంది ఉధ్యమ కారులు ఉధ్యమించారని వారిని విస్మరించి టిఆర్ఎస్ పార్టీ స్థానికేతురుడైన మాజీ కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డికి మెదక్ ఎంపి టికెట్టు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు తనకు అత్యధికంగా ఓట్లు వేసి తనను ఎంపిగా గెలిపించాలని రఘునందన్‌రావు కోరారు. ఈకార్యక్రమంలోబిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్,ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజెందర్, కౌన్సిలర్‌లు బుచ్చేష్‌యాదవ్,సంగసాని సురేశ్,బిజెపి మండల అధ్యక్షులు నీలి నాగేశ్ బిజెపి పట్టణ అద్యక్షులు ఆంజనేయులుగౌడ్,మాజీ సర్పంచ్ హెచ్‌వి. రమణారావు,నాయకులు గుండం శంకర్, కొత్త శ్రీనివాస్‌గుప్త,నీరుడి చంద్రయ్య ,బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

# నీటి గురించి చర్యలు తీసుకుంటాం..

**చిన్నశంకరంపేట,మార్చి 30,ప్రభాతవార్త:**

మండల పరిధి చెన్నాయిపల్లిలో వరి పంటలు ఎండిపోతున్నాయని, చెరువులోని నీటిని వదిలి పంట పొలాలకు అందించాలని రైతులు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారు స్పందించలేదు. కాగా శుక్రవారం నాడు వార్తలో ప్రచురితమైన చెరువు నీటిని పంటలకు వదలాలి అనే శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు, ఈఈ శ్రీనివాస్ శనివారం చిన్నశంకరంపేటలో తహసీల్దార్ కార్యాలయంలో ఇరు గ్రామాల రైతులతో మాట్లాడి, వారి సూచనల మెరకు గ్రామంలోకి వచ్చి చర్చించాలని కోరగా, తహసీల్దార్ మన్నన్, మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్, ఏఈవో శ్రీనివాస్, ఎస్ఐ నారాయణ గౌడ్‌లు శాలిపేట నల్ల చెరువు వద్దకు వెళ్లి మాట్లాడుతుండగా గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. నీటిని వదిలితేనే మా పంటలకు నీరు సరిపోదని, వరి పంట చేతికందే దశలో ఉందని, నీరు వదిలేది లేదని, వారు ఖరాఖండిగా చెప్పడంతో అధికారులు అక్కడి నుండి వెనుదిరిగారు. చెన్నాయపల్లి రైతులకు నీరు అందించాలని, ఇరు గ్రామాల వారితో మాట్లాడినప్పటికి శాలిపేట రైతులు అందుకు అంగీకరించలేదని, వార గ్రామంలో కుర్చొని చర్చించుకున్నాకా మరో సారి వారితో మాట్లాడుతామని అధికారులు తెలిపారు.



శాలిపేట చెరువు వద్ద రైతులు, గ్రామస్తులు


## మోడల్ స్కూల్‌లో 7న అడ్మిషన్ పరీక్షలు

**రామచంద్రాపురం, మార్చి 30, ప్రభాతవార్త:**

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఏప్రిల్ 7వ తారీఖున 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6 నుంచి 10వ తరగతి లో విద్యను అందుకునేందుకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం రాంప్రసాద్ తెలిపారు. మోడల్ స్కూల్‌లో 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వారికి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్షలు రాసే విద్యార్థులు ఏప్రిల్ 1 తారీఖు నుంచి వెబ్‌సైట్ నుంచి ప్రవేశ పరీక్ష కోసం హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు ఒక గంట ముందు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ధరఖాస్తు దారులు ఓఎంఆర్ షీట్‌లపై బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో సమాదానాలు గుర్తించాల్సి ఉంటుందన్నారు. 6వ తరగతిలో 6వ తరగతికి 301, 7వ తరగతికి 145, 8వ తరగతికి 134, 9వ తరగతికి 117, 10వ తరగతి ప్రవేశ పరీక్షలకు 38 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, బాల్ పాయింట్ పెన్నులు, వాటర్ బాటిళ్ల తప్ప మరే ఇతర స్టేషనరీ మెటీరియల్ తీసుకురావద్దని సూచించారు.

## మెడిసిన్ విద్యార్థికి కీజర్ యాపై ఆర్థిక సహాయం

### -కీజర్ యాపైని సన్మానించిన ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థి



కీజర్ యాపైని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థిల దృశ్యం

**జహీరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:**

నియోజకవర్గంలోని కోహీర్ మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద, వ్యవసాయ కూలీ మొహమ్మద్ సలావుద్దీన్ కుమారుడు మెడిసిన్ విద్యార్థి మొహమ్మద్ ఖిజర్‌కు కీజర్ యాపై శనివారం ఆర్థిక సహాయం అందచేశారు. నీట్‌లో అర్హత సాధించిన మొహమ్మద్ ఖిజర్‌కు నల్గొండ జిల్లలోని నార్కట్‌పల్లిలో కామినేని మెడికల్ కళాశాలలో ఉచితంగా వైద్య విద్యను అందుకునేందుకు అవకాశం దక్కింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్ కోసం డబ్బులు అవసరం కావడంతో మండల జర్నలిస్టు చొరవతో సామాజిక సేవకులు ఖిజర్ యాపైని సంప్రదించగా విద్యార్థికి ఆర్థిక సహాయం అందచేశారు. విద్యార్థికి ఆర్థిక సహాయం అందచేసిన ఖీజర్ యాపైని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌లు శాలువాతో సన్మానించి అభినందించారు. విద్యార్థి ఎంబిబిఎస్ అనంతరం రెండు సంవత్సరాల శిక్షణకు తన వంతు సహకారం అందిస్తానని కీజర్ యాపై హామి చేశారు. నిరుపేద విద్యార్థి డాక్టర్‌గా మారబోతుండటం పట్ల ఎంపి అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావులు ప్రత్యేకంగా విద్యార్థిని అభినందించారు.

## రానున్న పండగలను పసందుగా జరుపుకుందాం

### -కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్



పండగలను ఘనంగా జరుపుకునేందుకు సూచనలు చేస్తున్న కార్పోరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, మార్చి 30, ప్రభాతవార్త:**

ఏప్రిల్ మాసంలో జరుపుకునే పండగలను (ఉగాది, శ్రీ రామనవమి, హనుమాన్ జయంతి) పసందుగా ప్రశాంతంగా భక్తి బావాలు వెల్లి విరిసేలా జరుపుకునేందుకు ఎవరికి వారు తమ వంతు చొరవ తీసుకోవాలని రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటిని ఏర్పాటు చేశారు. సమావేశానికి కార్పోరేటర్ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా హాజరై సమావేశానికి హాజరైన వేదపండితులు, కుల సంఘాల నాయకులకు, భక్తులకు పలు సూచనలు చేశారు. ఏప్రిల్ 9న తెలుగు తొలి పండగ ఉగాది, 17న శ్రీ రామ నవమి, 23న హనుమాన్ జయంతి పండగలను జరుపుకోవాల్సి ఉందని వేద పండితులు బాలకృష్ణతెలిపారు. ఉగాది పర్వదినం రోజున ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు పంచాంగ శ్రావణ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు మూడు పర్వదినాల్లో పాల్గొని దైవ కృపకు పాత్రులు కావాలని కార్పోరేటర్ పుష్పనగేష్, పండితులు బాలకృష్ణలు సూచించారు.

## ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:**

టిఎస్ ఐడిసి మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ప్రముఖులు పాల్గొన్నారు. మహమ్మద్ తన్వీర్ నివాస గృహంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, బిఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు గాలి అనిల్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గుండప్ప, రామకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, నాయకులు కత్బుద్దీన్, బాసిత్, నర్సింహారెడ్డి, తాజుద్దీన్, శ్రీకాంత్‌రెడ్డి, రాములు నేత, మోతీరామ్, అబ్దుల్లాహ, మజర్, ఇబ్రహిం, అక్రమ్, శ్రీనివాస్ నాయక్, కిషన్ పాల్గొన్నారు.

## సహకార సంఘం అభివృద్ధికి కృషి

### -పీఏసీఎస్ ఛైర్మన్ అనంతరెడ్డి

**వెల్దుర్తి, మార్చి30 ప్రభాతవార్త:**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్నానని వెల్దుర్తి పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం వార్షిక మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో సిద్ధయ్య 2023-24 సంవత్సరపు పరిపాలన నివేదికలను చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ అనంతరెడ్డి మాట్లాడుతూ వెల్దుర్తిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో స్వంత స్థలలో డీసీసీబీని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, అలాగే స్వంత స్థలంలో దుకాణ సముదాయాలను నిర్మించడం జరిగిందని, త్వరలో వాటిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డీసీసీబీ బ్యాంకు ద్వారా సంఘ సభ్యులకు స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక రుణాలు ఇవ్వడం జరిగిందని, రుణాల రికవరీలో ముందుండాలని ఆయన సూచించారు. పీఏసీఎస్ ద్వారా 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 2023-24 సంవత్సరం యాసంగి, వానాకాలం సీజన్‌లలో 9,410 మంది రైతుల వద్ద ధాన్యం సేకరించడం జరిగిందన్నారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తే వారికి తిరిగి రుణం ఇవ్వడానికి వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మురళీ, డైరెక్టర్లు రమేష్‌చందర్‌గుప్త, నర్సింలు,కిష్టాగౌడ్, నర్సింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబుచేసిన శ్రీ సీతారామ ఉమామహేశ్వరాలయం

**గజ్వేల్ టౌన్, మార్చి 30 (ప్రభాతవార్త):**

శ్రీ సీతారామ ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, స్వస్తివాచనము, వరుణమంటప ఆరాధన, దేవతాహ్వానము, శ్రీ సీతారామచంద్ర స్వామికి పురుషసూక్త అభిషేకం, ఉమామహేశ్వర స్వామికి రుద్రాభిషేకం, మధ్యాహ్నం 12.30 గంటలకు మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. కావున భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీ సీతారామ ఉమామహేశ్వరస్వామిల ఆశీస్సులు పొందాలని తెలిపారు.

## నాలుగు లైన్ల రహదారిగా విస్తరింప చేయాలి

### - సీపీఎం నాయకులు నాగేశ్వరరావు

**పటాన్‌చెరు,మార్చి 30,ప్రభాతవార్త:**

పటాన్‌చెరు నుండి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ ఆర్ అండ్ బి రోడ్‌ను నాలుగలైన్ల రహదారిగా విస్తరణ చేయాలని సీపీఎం నాయకులు బి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని పారిశ్రామిక వాడభవన్‌లో జరిగిన సీపీఎం సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ పటాన్‌చెరు నుండి దౌల్తాబాద్ వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్‌ను విస్తరింప చేయాలన్నారు. ఇంద్రేశం,ఐనోల్, పేదకంజర్ల గ్రామాల పరిధిలో అర్ అండ్‌బి రోడ్ పూర్తిగా గుంతల మయం అయ్యి వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారన్నారు. ఈ రహదారి మార్గంలో దీవిచక్ర వాహనాలతో పాటు ఆటోలు, ఇతర భారీ వాహనాలు నిత్యం వెళ్తుంటాయన్నారు. వీటికి తోడు విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు పెద్ద ఎత్తున నిర్మాణం జరుగుతున్నందున భారీ నుండి అతి భారి వాహనాలు కంకర,మట్టి, ఇటుక, ఇసుకను తీసుకెళ్తున్నాయన్నారు. దీని మూలంగా బచ్చుగూడ చౌరస్తా , ఇంద్రేశం పంచాయతీ మూల వద్ద వాహనదారులు ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. ఈ సమస్యలను ఏ ఒక్క ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిత్యం వాహనదారులు ఏదో ఒక చోట ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే మరమ్మత్తులు చేపట్టి రహదారి విస్తరణ చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపిఎం నాయకులు మూర్తి, జయ కుమార్, చంద్రకిరణ్, వేంకటేశ్వరరావు,సత్తిరాజులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి బిజెపి మూడవ సారి అవకాశం ఇవ్వాలి

### -బిజెపి ఎంపి అభ్యర్థి బిబి పాటిల్



బిజెపి ఎంపి అభ్యర్థి బిబి పాటిల్ సమక్షంలో బిజెపిలో చేరుతున్న ఆయా పార్టీల నాయకులు

**అల్లాదుర్గం, మార్చి 30, ప్రభాతవార్త:** భారత దేశం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోయేందుకు కేంద్రంలో భారతీయ జనతా పార్టీకి మూడవ మారు అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందని జహీరాబాద్ ఎంపి బిజెపి అభ్యర్థి బిబి పాటిల్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలో పార్టీ కార్యాలయాన్ని ఎంపి బిబి పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బిబి పాటిల్ మాట్లాడుతూ తనకు మూడవ మారు అవకాశం కల్పిస్తే కేంద్రం నుంచి నిధులను తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానన్నారు. అంతకు ముందు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు (70 మంది వరకు) బిబి పాటిల్ సమక్షంలో బిజెపిలో చేరగా పార్టీ ఖండువాలు కప్పి బిబి పాటిల్ నాయకులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కులకర్ణి, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ ప్రభాకర్‌గౌడ్, ముత్తిరెడ్డి, అందోల్ అసెంబ్లి కన్వీనర్ చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు జి యాదగిరి, నాయకులు కాల రాములు, సాయగౌడ్, శంకరయ్య, రాంపూర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్

**వర్గల్, మార్చి 30 (ప్రభాతవార్త):** గంజాయి అమ్ముతున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మర్కుక్ గ్రామానికి చెందిన మొర్సు విఘ్నేందర్, పాములపర్తి గ్రామానికి చెందిన పిట్ల రాజు అనే యువకులు గౌరారం గ్రామంలోని పాములపర్తికి వెళ్ళే దారి వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో గౌరారం ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని వారిని పరిశీలించారు. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లో ప్లాస్టిక్ కవర్‌లో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీనిపై వారిని విచారించగా హైద్రాబాద్‌లోని టాంక్‌బండ్ నుండి ఉమేశ్‌సింగ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి వారు తాగుతూ వర్గల్ మరియు చుట్టు పక్కల గ్రామాల్లో యువకులకు, లేబర్‌కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి 60 గ్రాముల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయించినా, తాగినా 8712667336, 8712667340 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. గంజాయి విక్రయించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గంజాయి అమ్ముతున్న వ్యక్తులను చూపుతున్న గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి

